
సాక్షి
తిరుపతి
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024

విరిసిరులతల్లి





ఆహా ఏమీ నా భాగ్యం అని విరులు మురిసిపోయాయి. సిరులతల్లి సేవలో తరించాయి. తిరుచానూరు పద్మావతి కార్తీక బ్రహ్మోత్సవాల అనంతరం శనివారం అమ్మవారికి వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పార్చన చేశారు. దేశ, విదేశాలకు చెందిన 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలు సుమారు 4 టన్నులతో శ్రీవారి దేవేరికి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. భక్తులు యాగం వీక్షించి, తరించారు. – చంద్రగిరి

న్యూస్‌రీల్

తిరుపతి ఎస్పీకి చిత్తూరు అదనపు బాధ్యతలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్పీగా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం చిత్తూరు ఎస్పీగా ఉన్న మణికంఠ చందోలు వ్యక్తిగత పనులపై ఈనెల 11వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన వచ్చేంత వరకు తిరుపతి ఎస్పీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషీ ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఏడుగంగల జాతర చాటింపు



ఏడు గంగమ్మల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి

శ్రీకాళహస్తి: పట్టణంలో ఏడు గంగమ్మల జాతర చాటింపు ఆదివారం అర్ధరాత్రి నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తిలో మాత్రమే ఏడు ప్రాంతాల్లో ఏడుగురు గంగమ్మలను కొలువుదీర్చి జాతర నిర్వహించనున్నారు. ఈ నెల 11వ తేదీ ఏడు గంగల జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి చాటింపు నిర్వహిస్తారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున సారె సమర్పిస్తారు. బుధవారం ఉదయం అమ్మవార్లు ఆయా ప్రాంతాల్లో కొలువు దీరనున్నారు. రాత్రి 8 గంటలకు నిమజ్జనం కార్యక్రమం జరుగుతుంది. ఇందుకోసం ఆయా గంగమ్మలను కొలువు దీర్చే ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

లక్ష్మీనరసింహుడికి 60 వేల అమెరికన్ డాలర్లు



ఏసీకి చెక్కు అందజేస్తున్న దాతలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థానంలో లడ్డూ పోటు నిర్మాణానికి ఓ దాత 60 వేల(రూ.50లక్షలు) అమెరికన్ డాలర్లు బహూకరించారు. వైఎస్సార్‌జిల్లాకు చెందిన సానేపల్లి చిన్నపెంచలరెడ్డి, కీర్తిశేషులు లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సానేపల్లి రామ్మోహన్‌రెడ్డి శనివారం ఈ మొత్తాన్ని అందజేసినట్లు దేవస్థానం ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దాతకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి, తీర్థప్రసాదాలు అందించినట్లు తెలిపారు. అన్నవరం ప్రసాద్‌రెడ్డి, రామోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సిలికా రవాణా అక్రమార్కులకు వరంగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లలో పొరుగు రాష్ట్రాలకు తరలించి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఎన్నికల ముందే సిలికా మైన్లు మూసివేశారు. అయినా కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి కనుసైగలతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదు. ఫలితంగా ఈ ఖనిజం కరిగిపోతోంది.

కేసుల్లేవు.. సిలికాసులే

మూతపడిన సిలికా మైన్‌లో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న యంత్రాలు



- అడ్డదారుల్లో సిలికా అక్రమ రవాణా
- మైన్లు మూతపడినా ఖాతరు చేయని అక్రమార్కులు
- కళ్లెదుటే తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు వీలున్న చోటల్లా అడ్డదిడ్డంగా సిలికా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. చిల్లకూరు, కోట మండలాల్లో సిలికా విస్తారంగా దొరుకుతుంది. దీనిపై కన్నేసిన నియోజకవర్గ ప్రజా ప్రతినిధి సిలికా వ్యాపారంలో అనుభవం ఉండే తన అనుచరులను రంగంలోకి దింపి, అనుమతులు లేకుండా మూతపడి ఉన్న సిలికా మైన్లను సొంతం చేసేకుని అక్రమ రవాణాకు తెరతీశారు. పలు పరిశ్రమల్లో వినియోగించే సిలికా ఖనిజానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. టన్ను రూ.1500 నుంచి రూ.3 వేల వరకు పలుకుతోంది. ఇసుక డిమాండ్ కావడంతో భవన నిర్మాణ రంగంలోకి దీనిని ఉపయోగించే వారు టన్ను రూ. 5 వేల వరకు చెల్లించి కొనుగోలు చేస్తుంటారు. సిలికా రవాణా ఎన్నికలకు ముందుగా నిలిచిపోయింది. గనుల్లో తవ్వకాలు చేపట్టే పనులపై ప్రభుత్వం పాలసీ తీసుకోలేదని ఏడు నెలలుగా ఎక్కడ పనులు అక్కడ ఆపి వేశారు. దీంతో అధికారం చేపట్టిన నాయకులకు ఆదాయ వనరు లేకుండా పోయింది. దీంతో అధికార పార్టీ నాయకులు వ్యవస్థను చేతిలోకి తీసుకుని హుకుం జారీ చేస్తూ అడ్డదారుల్లో సిలికాను అక్రమంగా తరలించి, కొల్లగొడుతున్నారు. చిల్లకూరు, కోట మండలాల్లో విస్తారంగా ఉండే సిలికా మైన్లు చాలా వరకు లీజు కాలం చెల్లినవే ఉన్నాయి. వీటిపై స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధి కన్నుపడింది. దీంతో వాటిలో మిగిలి ఉన్న సిలికాను స్వాధీనం చేసుకుని, అక్రమంగా తవ్వి, తరలించి సొమ్ము చేసుకోవాలనుకున్నారు. దీంతో స్థానికంగా ఉండే నాయకులకు పనులు అప్పగించారు. వారు కాలం చెల్లిన మైన్ ఓనర్ల వద్దకు వెళ్లి బేర సారాలు చేస్తున్నారు. వారు అందుకు ససేమిరా అంటే బెదిరించి, తమకు అడ్డు రావద్దని వారి వద్ద నుంచి మైన్లు స్వాధీనం చేసుకుంటూ అందులో సిలికాను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో కూడా అధికారంలో ఉన్న సమయంలో ప్రజా ప్రతినిధికి సిలికా మైన్స్ యజమానుల నుంచి ప్రతి నెలా (ఎంఎంఎఫ్) ఎమ్మెల్యే మినరల్ ఫండ్ పేరుతో రూ.లక్షలు వసూలు చేసిన విషయమై నేటికీ మైన్ల యజమానులు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. అయితే ఇప్పుడు మైన్లకు లీజుల కాల పరిమితి ముగిసిపోవడంతో అక్కడ తవ్వకాలు, రవాణా లేకుండా పోయింది. దీంతో వాటినే షేరుగా సొంతం చేసుకుని సొమ్ము చేసుకోవచ్చని ఒక అడుగు ముందుకు వేసి, తన అనుచరులకు పనులు పురమాయించారు. ఈ క్రమంలోనే రెండు రోజులుగా తీర ప్రాంతంలోని వరగలిలో మూతపడిన సిలికా మైన్‌ను మోమిడి గ్రామానికి చెందిన ఓ చోట నాయకుడి ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధి లీజుదారుల నుంచి లాక్కుని, అక్రమంగా తవ్వకాలు చేపట్టడం మొదలు పెట్టారు. ఎవరైనా అడిగితే మైన్‌కు ఆవలి వైపున ఉన్న వేరుశనగ సాగు వద్దకు దారి లేదని అందుకు మైన్‌లో నుంచి దారి తీసేందుకు పనులు చేయిస్తున్నామని మభ్య పెడుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి 12 లారీలను బెంగళూరుకు తరలించారు. ఒక్కొక్క లారీలో సుమారుగా 50 టన్నుల సిలికాను రవాణా చేశారు. మరుసటి రోజు కూడా అక్రమంగా తరలించేందుకు యంత్రాలను పెట్టి తవ్వకాలు చేస్తుండడంతో స్థానికులు ఫిర్యాదు చేయగా గనుల శాఖ ఆర్‌ఐ, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు అక్కడికి వెళ్లి తవ్వకాలను నిలిపి వేయాలని సూచించారు. అప్పటికి తాత్కాలికంగా పనులు ఆపి వేసిన అధికార పార్టీ నాయకులు, వారు అటు వెళ్లగానే తవ్వకాలు చేపట్టి ఒక చోటకు గుట్టగా సిలికాను పోసి ఉంచారు. ఇటీవల వర్షం పడడంతో సిలికా ఎక్కువ తడిగా ఉంటుంది. లారీలో 50 టన్నులు వరకు రవాణా చేయాలంటే తడిగా ఉంటే వీలు లేకపోవడంతో తవ్వకాలు జరిపి, గుట్టగా పోసి ఆరిన తరువాత తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ నుంచి తరలించే సిలికా టన్ను రూ.1,200 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక లారీలో తరలించే 50 టన్నుల సిలికా విలువ సుమారు రూ.60 వేల వరకు ఉంటుంది.

కోట, చిల్లకూరులో ఉన్న సిలికా మైన్లు	78
రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నవి	18
ప్రభుత్వానికి సరెండర్ చేసినవి	11

అనుమతులు తూచ్...

గత ఏడు నెలలుగా సిలికా, క్వార్ట్జ్ ఎగుమతులకు సంబంధించి గనుల శాఖ రాయల్టీ కట్టించుకుని అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అది కూడా నేరుగా ఎక్కడ కూడా సిలికా మైన్ నుంచి తవ్వకాలు జరిపి తీసుకురాకూడదు. మైన్ నుంచి తవ్విన అనంతరం అనుమతి పొందిన యార్డులకు తరలించుకుంటే వారు పరిశ్రమలకు ఎగుమతి చేసుకునేందుకు నిబంధనల మేరకు పర్మిట్లు గనుల శాఖ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే నేడు అధికార పార్టీ ప్రజా ప్రతినిధి వ్యవస్థలను తన కను సైగలతో ఆజ్ఞాపిస్తూ ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో అక్రమంగా తరలించే సిలికా లారీలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.



యంత్రాలతో తవ్వి గుట్టగా పోసిన సిలికా

పట్టించుకునే వారు ఏరీ...

అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారం అక్రమంగా సిలికా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన గనులశాఖ, పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధి వ్యవస్థను తన చేతిల్లోకి తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒక వైపు ప్రభుత్వం గనుల్లో పనుల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోక ముందే చిల్లకూరు, కోట మండలాల్లోని సిలికా మైన్లను తమ సొంతం చేసుకునేందుకు సిద్ధ పడుతున్నారు. దీంతోనే కాలం చెల్లిన మైన్లపై దృష్టి పెట్టి అందులో ఉన్న సిలికాను కొల్లగొడుతున్నారు. ఇటీవల కోట మండలంలోని ఓ పరిశ్రమకు చెందిన మైన్ పై దృష్టి పెట్టి నేరుగా కంపెనీ ప్రతినిధులకే అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది. అయితే వారు పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకుని రావడంతో అక్కడి మైన్‌పై నుంచి తాత్కాలికంగా దృష్టిని మరల్చినట్లు తెలుస్తోంది. సిలికా అక్రమ తవ్వకాలపై గనుల శాఖ ఏడీ శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా తాను సెలవులో ఉన్నానని, అయినా తనను ప్రశ్నించడం ఏమిటని దురుసుగా సమాధానం ఇవ్వడం విశేషం.

పంపిణీకి సిద్ధంగా మామిడి, కొబ్బరి మొక్కలు

శ్రీకాళహస్తి రూరల్: నాణ్యమైన మామిడి, కొబ్బరి మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యాన నర్సరీలో మామిడి, కొబ్బరి మొక్కల నాణ్యతా ప్రమాణాలను ఆయన శనివారం ఆయన పరిశీలించారు. జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ ఉద్యానశాఖ పథకాల్లో భాగంగా నర్సరీలో తక్కువ ధరకు మొక్కలు ఇస్తామన్నారు. అవసరమైన రైతులు ఇందుకోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మామిడి మొక్క రూ.45, కొబ్బరి మొక్క రూ.60 అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మామిడిలో బేనిషా(బంగినపల్లి), బెంగ్లూర, మల్లిక, నీలమ్, చందుర రకాలు, బేనిషా 4 అడుగుల మొక్కలు, మల్లిక, బెంగ్లూర 3 అడుగుల మొక్కలు, నీలం, చందుర మొక్కలు జనవరి 15వ తేదీకి అందుబాటులోకి వస్తాయన్నారు. మొక్కలు కావాల్సిన రైతులు 7995086968, 9100411321 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మాదకద్రవ్యాలు వద్దు బ్రో

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి
- విద్యార్థులకు పిలుపునిచ్చిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు




మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: మాదకద్రవ్యాలు వద్దు బ్రో అనే నినాదంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్‌లను జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని, డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కల్పించారు. మంగళం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి జిల్లా శనివారం ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు పాల్గొని, ప్రసంగించారు. ఎస్పీ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడి వైపు ఒక అడుగు వేయాలన్నారు. మనమందరం కలిసి మాదక ద్రవ్య రహిత జిల్లాగా, రాష్ట్రంగా మన సమాజం కోసం నడుం బిగించకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదని, ఇది నెరవేరాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం చాలా ముఖ్యమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక పోలీసుగా భావించి మాదక ద్రవ్యాలపై యుద్ధం చేయాలన్నారు. ఇప్పుడు మన పిల్లల్ని మనం కాపాడుకోకపోతే రేపటికి మనం మన పిల్లల్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. పిల్లలు కూడా ఒక్క క్షణం ఆలోచించి, మనం బడికి ఎందుకు వచ్చాం, మన ఆశయాలు ఏమిటి, మన గమ్యం ఎటు వైపు అనే ఆలోచనతో ఇప్పటి నుంచే క్రమశిక్షణతో భవిష్యత్తు వైపు అడుగు వేయాలన్నారు. ప్రజలు, భావిభారత పౌరులను పోలీసులు కోరేది ఒక్కటే అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన సంఘటనలను అరికట్టడానికి.. మాదకద్రవ్య రహిత సమాజాన్ని సృష్టించేందుకు తమ ప్రయత్నాలకు ప్రజల మద్దతు ఎంతైనా అవసరమన్నారు. మీకు ఏదైనా సమాచారం ఉంటే, సహాయం కావాలంటే దయచేసి మా హెల్ప్‌లైన్ నంబర్లు 112, 80999 99977, 1972 నంబర్లలో సంప్రదించాలన్నారు. కలిసి నడుద్దాం సురక్షితమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకుందామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ బి.హేమంత్, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, ఎస్పీ డీఎస్పీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

అనంత స్వర్ణమయ దాతలకు వీఐపీ బ్రేక్

తిరుమల: ఆనంద నిలయం అనంత స్వర్ణమయం పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు వీఐపీ బ్రేక్ (జనరల్) దర్శనాలను ఇవ్వాలని టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. 2008లో టీటీడీ సంకల్పించిన ఈ పథకాన్ని కొన్ని అనివార్య కారణాలతో నిలిపివేసిన సంగతి విదితమే. అప్పట్లో ఈ పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు అర్చనానంతర దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇప్పుడు అర్చనానంతర దర్శన సేవ లేకపోవడంతో ప్రస్తుత ధర్మకర్తల మండలి ఈ పథకం దాతలకు ప్రత్యామ్నాయంగా వీఐపీ బ్రేక్ (జనరల్)దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకుంది.



సౌకర్యాల వివరాలు ఇలా..

- అర్చనానంతర దర్శనానికి బదులుగా గరిష్టంగా ఐదుగురు కుటుంబ సభ్యులకు సంవత్సరానికి మూడు రోజులు వీఐపీ బ్రేక్ (జనరల్)దర్శనాలకు అనుమతిస్తారు.
- రూ.2,500 టారిఫ్‌లో సంవత్సరానికి మూడు రోజులు వసతి కల్పిస్తారు.
- సంవత్సరానికి ఒకసారి 20 చిన్న లడ్డూలు ప్రసాదంగా అందిస్తారు.
- దాతల దర్శన సమయంలో సంవత్సరానికొకసారి బహుమానంగా ఒక దుపట్టా, ఒక బ్లౌజ్ బహుమానంగా అందిస్తారు.
- దాతల మొదటిసారి దర్శన సమయంలో ఐదు గ్రాముల బంగారు డాలర్, 50 గ్రాముల వెండి నాణెం బహుమానంగా ఇవ్వనున్నారు.
- సంవత్సరానికొకసారి పది మహాప్రసాదం ప్యాకెట్లు అందిస్తారు.
- విరాళం పాస్‌బుక్ జారీ చేసిన తేదీ నుంచి 25 ఏళ్ల పాటు చెల్లుబాటులో ఉంటుంది.

వేంకటేశ్వర స్తోత్రం ఆడియో ఆవిష్కరణ

తిరుమల: వేంకటేశ్వర స్తోత్రం ఆడియో ఆల్బమ్‌ను శుక్రవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తిరుమలలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. బాలగాయని నియార నాగ సుంకరినేని ఈ పాటను ఆలపించారు. ఈ పాటకు నిటార నాగ సుంకరినేని అనే చిన్నారి వాద్య సహకారం అందించింది. ఈ ఆల్బమ్‌కు డాక్టర్ కె.స్వరూప సంగీత సమర్పకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా చిన్నారులను టీటీడీ చైర్మన్ అభినందించారు. మరిన్ని పాటలతో తన గానామృతాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. గాయని తల్లిదండ్రులు డాక్టర్ నిష్మా సుంకరనేని, డాక్టర్ నిఖిల్ సుంకరనేని పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదుపు తప్పి కారు బోల్తా



కాలువలో నుంచి కారును బయటకు తీస్తున్న జనం

కోట: అదుపు తప్పిన కారు కల్వర్టు గోడను ఢీకొని పంటకాలువలో బోల్తా పడిన ఘటన శుక్రవారం రాత్రి కోట క్రాస్ రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వాకాడు నుంచి విద్యానగర్‌కు వెళుతున్న కారు అదుపు తప్పి కల్వర్టు గోడను ఢీకొని, స్వర్ణముఖి పంట కాలువలోకి దూసుకెళ్లింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. శనివారం ఉదయం కారును క్రేన్ సాయంతో బయటకు తీశారు. కారు విద్యానగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌దని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులు ఎటువంటి సమాచారం లేదు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,782 మంది స్వామివారిని దర్శించుకోగా 26,057 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పోతినమ్మా.. వస్తినమ్మా!

- జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్‌కు స్పందన కరువు
- 50 శాతం దాటని తల్లిదండ్రుల హాజరు
- జిల్లాలో 1.50 లక్షల మందికిగాను 60 వేల మంది హాజరు
- తూతూ మంత్రంగా ముగిసిన సమావేశాలు

మెగా పీటీఎం.. ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయం.. పెద్ద ఎత్తున ప్రచారం.. అతిరథ మహారథులకు ఆహ్వానం.. హంగూ ఆర్భాటం.. రూ.లక్షలు వ్యయం.. అయినా మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు దుమ్మా కొట్టిన వైనం.. వెరసి.. ప్రసంగాలు, ఆటపాటలు..డాన్స్‌లకే పరిమితం. ఫలితంగా పోతినమ్మా.. వస్తినమ్మా అన్న చందంగా మారిన పీటీఎం.. అధికార యంత్రాంగం ఒకింత అసహనం.

తిరుపతి సిటీ: వస్తినమ్మా.. పోతినమ్మా అనే చందంగా తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు తూతూ మంత్రంగా సాగాయి. ఆటలు, పాటలు, డ్యాన్సులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు ప్రధానాంశ్యాలుగా సమావేశాలు జరిగాయే తప్ప, సమస్యల ప్రస్తావన ఊసేలేదు. సుమారు 2 వేల పాఠశాలలో 30 శాతం మంది తల్లిదండ్రులు సైతం సమావేశాలకు హాజరుకాలేదు. కేవలం వంద స్కూళ్లలో మాత్రమే 60 శాతం మంది హాజరుకాగా, మరో 300 పాఠశాలలో 50 శాతానికి మించకపోవడం విశేషం. తొండమనాడు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌కు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. తల్లిదండ్రులతో కలిసి ఆటలాడి ఉత్సాహ పరిచారు.

తిరుపతి జిల్లా సమాచారం

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	హాజరైన పేరెంట్స్
వెంకటగిరి	492	18,567	10,201
సత్యవేడు	389	25,748	3,564
శ్రీకాళహస్తి	351	24,457	9,987
సూళ్లూరుపేట	384	25,402	11,780
గూడూరు	370	19,650	10,700
చంద్రగిరి	346	17,856	9,559
తిరుపతి	69	12,145	5,242



టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు

మాకు సమయం ఇవ్వలేదు



మా అబ్బాయి బైరాగిపట్టెడలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. ఉదయం 10 గంటలకు పాఠశాలకు వెళ్లాం. ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు వారి గొప్పలు చెప్పుకున్నారు. ఆ మాటలు విన్నాం. 12 గంటలకు ఇంటికి వచ్చాం. ఇది పాఠశాలలో జరిగిన సమావేశం అంతే. మా పిల్లలు ఎలా చదువుతున్నారని, ఆరా తీసేందుకు సమయమే ఇవ్వలేదు.

–రత్నమ్మ, విద్యార్థి తల్లి, తిరుపతి

అంతా హంగామానే..



విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సలహాలు ఇస్తారనే లక్ష్యంతో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా మైకులలో ఊకదంపుడు ప్రసంగాలకే సమయం కేటాయించారు. ఒకరిద్దరు తల్లిదండ్రులతో మాత్రమే మాట్లాడించి సమావేశం ముగిసిందనిపించారు.

–రేవతి, విద్యార్థిని తల్లి, శ్రీకాళహస్తి

అయ్యప్పమాల ధారణ చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



మాలధారణలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం కపిలతీర్థంలోని శ్రీకపిలేశ్వర స్వామి ఆలయంలో అర్చక పండితులచే అయ్యప్ప మాలధారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి శ్రీకపిలతీర్థంలో పుణ్యస్నానం ఆచరించి, అనంతరం స్వామివారి ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్మరణతో అయ్యప్పమాల ధారణ చేపట్టారు. అనంతరం సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో కొలువైన శ్రీఅయ్యప్ప స్వామి వారిని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

నేడు భగవద్గీత కంఠస్థ పోటీలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ అన్నమాచార్య కళామందిరంలో విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు జరుగనున్నాయి. తిరుపతిలోని విద్యార్థులకు భగవద్గీత ఆరో అధ్యాయం ఆత్మ సంయమ యోగం (ధ్యానయోగం)లో పోటీలు నిర్వహిస్తారు. 6,7 తరగతులు ఒక విభాగంగా, 8, 9 తరగతులు మరో విభాగంగా ఈ పోటీలు నిర్వహిస్తారు. అలాగే 700 శ్లోకాలు కంఠస్థ పోటీలో 18 ఏళ్లలోపు, 18 ఏళ్లు పైబడిన వారికి విభాగాలుగా పోటీలు జరుగనున్నాయి.

విభిన్న ప్రతిభావంతులు రాణించాలి



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లోను రాణించాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నిర్వహించాల్సిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినం నాలుగు రోజులు ఆలస్యంగా నిర్వహించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవై శ్రీనివాస్ తిరుపతి, చిత్తూరు రెండు జిల్లాలకు అధికారిగా ఉన్నారు. ఈ నెల 3వ తేదీన చిత్తూరు నిర్వహించారు. అయితే తిరుపతిలో మాత్రం ఆలస్యంగా చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు తమ ప్రతిభను చాటుకోవాలని చెప్పారు. ఎవరిపై ఆధారపడి జీవించకుండా స్వయం కృషితో జీవించేలా అభివృద్ధి చెందారని ఆకాంక్షించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవై శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో కాళ్లు, చేతులు, కళ్లు, శారీరక, మానసిక వైకల్యం, దృష్టి వైకల్యం, వినికిడి లోపం, మానసిక ఆరోగ్యం, తల సేమియా తదితర 21 రకాలు ఉన్నారని వెల్లడించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను వారికి అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నేతలు మాధవ, మురళి, సుబ్రమణ్యం, రెడ్డెప్ప, విజయ లక్ష్మి, సుబ్రమణ్యం రెడ్డి, పద్మజ, విభిన్న ప్రతిభావంతుల శాఖ జిల్లా సూపరింటెండెంట్ వినోద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టవా?

- వ్యవసాయ సర్వీసులు త్వరగా ఇవ్వండి
- రోడ్లు మరమ్మతులు చేయరా ?
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- సమస్యలు ఏకరువు పెట్టిన జెడ్పీటీసీలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పక్కన సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: మండల పరిధిలో జెడ్పీటీసీలకు కేటాయించిన అభివృద్ధి పనులను సకాలంలో ఎందుకు చేయడం లేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధికారులను ప్రశ్నించారు. శనివారం జెడ్పీలోని చైర్మన్ చాంబర్‌లో చైర్మన్ అధ్యక్షతన, సీఈఓ రవికుమార్‌నాయుడు ఆధ్వర్యంలో 1,7,2,4 స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. అదే సమయంలో సీఈఓ కార్యాలయంలో 3,5,6 సంఘాల సమావేశాలు డిప్యూటీ సీఈఓ జుబేదా అధ్యక్షతన వైస్ చైర్మన్ రమ్య, స్త్రీ శిశు సంక్షేమ కమిటీ చైర్మన్ భారతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత అధికారులు పలు అంశాలపై మాట్లాడారు.

జెడ్పీటీసీ సభ్యులకు వేతనం ఇవ్వండి

జిల్లాలో పలునెలలుగా పెండింగ్‌లో ఉన్న జెడ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనం మంజూరు చేయాలని పలువురు జెడ్పీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాల కింద చేసిన పనులకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సచివాలయం, వాటి సమీపంలో మరుగుదొడ్లు, అంగన్‌వాడీ భవనం, బల్క్‌మిల్క్ యూనిట్లు, రైతు భరోసా కేంద్రాలను పంచాయతీల పరిధిలో నిర్మించామన్నారు. దాదాపు పనులు పూర్తయినా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ఆ భవనాలను ఎందుకు వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద 2014–19లో చేసిన పనులకు సంబంధించి 2.5 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. 2015–16లో జలవనరులశాఖ ద్వారా చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇంక ఇవ్వలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వాటర్‌వర్క్స్‌కు పనులు చేయాలంటే కలెక్టర్ అనుమతి అవసరమని చెప్పారు. ఆ పనులు చేయడానికి సంబంధిత అధికారులకు శ్రద్ధ లేదని ఫిర్యాదు చేశారు. జీడీనెల్లూరు జెడ్పీపాఠశాల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. చీకటిపడితే ఆల్లరిమూకలు గంజాయి తాగుతూ మత్తులో తూలుతున్నారని ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రహరీగోడ ఎత్తు పెంచాలని, రక్షణ కల్పించాలని కోరారు. వీటిపై మండల విద్యాశాఖాధికారికి తెలిపినా, పాఠశాల సమీపంలో పోలీసుస్టేషన్ ఉన్నా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ పించన్ తీసుకోవడానికి కావాల్సిన అర్హత, వివరాలు సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు.

నిర్వహణ లోపం

జెడ్పీ స్టాండింగ్ కమిటీల సమావేశం నిర్వహణ లోపం కనపడుతోంది. సమావేశాలను సంఘాల వారీగా నిర్వహించడం లేదని విమర్శలు వస్తోంది. ఒకేసారి గుంపుగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కమిటీ కమిటీకు జెడ్పీటీసీ సభ్యులు మారడం జరగాలి కానీ అలా కనిపించడం లేదు. ఒకేసారి సమావేశం మొదలుపెట్టి వారితోనే చివరి వరకు ముగించేస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన జెడ్పీ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగన్న, పార్వతి, కేశవులు, దామోదార్, సోము, మురళీ, గాంధీ, శివన్న, లక్ష్మీప్రియ, కరుణాకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యం

మండల పరిధిలో చేపట్టాల్సిన పనులను అధికారులు అలసత్వంతో పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పలమనేరు నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరన్నారు. పలమనేరు–ముళ్‌బాగల్ మార్గంలో కీలపట్ల వద్ద సర్వీసు రోడ్డులో వర్షపునీరు నిలిచిపోతోందని పేర్కొన్నారు. అక్కడ అండర్‌పాస్ రోడ్డు నిర్మించాలని అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేయడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులకు సకాలంలో విద్యుత్ సర్వీసులు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. విద్యుత్ సమస్యతో పంటలు వేసుకోలేక రైతులు అల్లాడుతున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వేలాది సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారులను అడిగితే మెటీరియల్స్ లేవని అంటున్నారని చెప్పారు. పీఎం సూర్యఘర్ ద్వారా సౌర ఫలకాల ఏర్పాటు అంశంపై ఆరా తీశారు.